ప్రజాశక్తి

శుక్రవారం 3 మే 2024

I

అల్లూరి సీతారామరాజు

గిరిజనులకు తప్పని డోలీ కష్టాలు

- రాత్రి వేళలో ఆసుపత్రికి తరలింపు

ప్రజాశక్తి -అనంతగిరి: ఆరోగ్యం విషమించిన బాలికకు కుటుంబ సభ్యులు కర్రలో డోలి కట్టి బుధవారం రాత్రి 8 గంటల సమయంలో కొండ కోనల నడుమ సుమారు మూడు కిలోమీటర్లు దూరం టార్చ్ లైట్లు పట్టుకొని తరలించిన ఘటన మండలంలోని పెద్దకోట పంచాయతీ సింధుగులపాడులో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన జన్ని. కుమారి (20)కి బుధవారం సాయంత్రం హఠాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు గ్రామం నుండి బల్లిపురం మెయిన్ రోడ్డుకు తరలించారు. అక్కడ నుండి ప్రవేటు ఆటోలో దేవరపల్లి మండలం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో కెజిహెచ్‌కు తరలించారు.

చీకట్లో తరలిస్తున్న కుటుంబీకులు

పింఛను సొమ్ము కోసం పాట్లు

-బ్యాంకులకు భారీగా తరలివచ్చిన లబ్ధిదారులు- ఎండవేడికి తీవ్ర ఇబ్బంది పడ్డ వృద్ధులు

ప్రజాశక్తి-చింతూరు : ప్రభుత్వం ఇచ్చే సామాజిక పింఛన్ల సొమ్మును ఈ నెలలో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో ఆ డబ్బులు తీసుకొనేందుకు గురువారం బ్యాంకులకు భారీగా తరలివచ్చిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ ఉన్నందున వాలంటీర్ల సేవలను నిలిపివేయడంతో పింఛన్లు ఇంటింటికి పంపిణీ ఏప్రిల్ నెలలోనే నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో మే నెలలో పింఛన్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. ఈ డబ్బులు తీసుకొనేందుకు గురువారం చింతూరులోని భారతీయ స్టేట్ బ్యాంకుకు పింఛను లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చింతూరు చుట్టుపక్కల 100 గ్రామాలకు ఈ బ్యాంకే ఆధారం. మారుమూల గిరిజన గ్రామాల నుండి ఆటోలు, ఇతర రవాణా సౌకర్యాల ద్వారా పింఛనుదారులు మండల కేంద్రానికి వచ్చి ఉదయం నుండి బ్యాంకు ముందు బారులు తీరారు. ఒకేసారి అధిక సంఖ్యలో పింఛనుదారులు రావడంతో అందుకు సరిపడా సిబ్బంది లేకపోవడంతో చెల్లింపులు కొంతమేర జాప్యం జరిగింది. దీంతో లబ్ధిదారులు సాయంత్రం వరకు నిరీక్షించాల్సి రావడంతో ఆకలితో ఎండ వేడికి తాళ లేక వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

చింతూరులో బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న పింఛనుదారులు

ఎండ వేడితో ఇబ్బంది

పింఛన్లు ప్రతి నెలా ఇంటి వద్దనే ఇచ్చేవారు. ఎన్నికల నేపథ్యంలో బ్యాంకు ఖాతాలో పడతాయని చెప్పడంతో ఈరోజు బ్యాంకు వద్దకు వచ్చాను. ఉదయం తొమ్మిది గంటల నుండి ఇక్కడే ఉన్నాను. ఎండ వేడి భరించలేకుండా తీవ్ర ఇబ్బంది పడ్డాను.

- సోడి బుచ్చమ్మ సూరన్న గొంది గ్రామం

15 కిలోమీటర్లు ప్రయాణించి వచ్చాను

పింఛను డబ్బులు బ్యాంక్ ఖాతాలో పడతాయని సచివాలయ సిబ్బంది చెప్పడంతో సూరన్నగొంది నుండి చింతూరుకు 15 కిలో మీటర్లు ప్రయాణించి వచ్చాను. ఎండ వేడి ఎక్కువగా ఉంది. బ్యాంకు వద్ద ఎక్కువ మంది ఉండడంతో సాయంత్రం వరకు ఉండాల్సి వచ్చింది. చాలా ఇబ్బందికి గురయ్యాను. ప్రతినెలా ఇంటి వద్దనే పింఛను ఇస్తే మాకు మంచింది.

- కట్టం పెద్ద సీతమ్మ, సూరన్న గొంది గ్రామం

పింఛన్ల కోసం బారులు తీరిన వృద్ధులు

రంపచోడవరం : స్థానిక యూనియన్ బ్యాంకులో గురువారం వృద్ధాప్య పింఛన్ల సొమ్ము కోసం రంపచోడవరం పరిసర ప్రాంతాల నుండి లబ్ధిదారులు భారీగా తరలి వచ్చారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ఉదయం నుండ బ్యాంకు వద్ద వృద్ధులు బారులు తీరారు. వీరి కోసం బ్యాంకు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పింఛన్ కోసం వెతలు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:- వయోవృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న పింఛన్లు ఈనెల లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయడంతో పింఛన్లు తీసుకోవడానికి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా డుంబ్రిగూడలో యూనియన్ బ్యాంకు, కించుమండలో స్టేట్ బ్యాంకులు ఉంది. ఈ బ్యాంకులకు సుమారుగా 20 నుంచి 30 కిలోమీటర్లు దూరంలో మారుమూల గ్రామాలు ఉన్నాయి. అంతదూరం నుంచి బ్యాంకుల వద్దకు వ్యయ ప్రయాసాలతో ఉదయం చేరుకుని సాయంత్రం వరకు బ్యాంకుల వద్ద వేచి ఉంటూ పింఛన్లు తీసుకుని తిరుగు ముఖం పడుతున్నారు. ఎండల తీవ్రత అధికంగా ఉండడంతో పింఛన్ లబ్ధిదారుల సౌకర్యార్థం నీడ సౌకర్య కల్పించడానికి యూనియన్ బ్యాంకులో సిబ్బంది టెంటు సౌకర్యం కల్పించినప్పటికీ లబ్ధిదారులకు సరిపడక పోవడంతో కొంతమంది సమీపంలోని చెట్టు నీడల్లో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కించమండ బ్యాంకులో అధికంగా లబ్ధిదారులు తరలి రావడంతో క్యూ లైన్ రోడ్డు వరకు చేరడంతో ఎండల్లో నిలబడి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొంతమంది లబ్ధిదారులకు రెండు, మూడు బ్యాంకుల్లో అకౌంట్లు ఉండటంతో పింఛన్ నగదు ఏ బ్యాంక్ ఖాతాలో పడిందో తెలుసుకోవడానికి బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందని పలువురు బాధిత పింఛన్ దారులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా నడవలేని వయోవృద్ధులు మరింత ఇబ్బందులు పడ్డారు.

డుంబ్రిగుడలో చెట్టు కింద కూర్చున్న పింఛనుదారులు

హుకుంపేట: మండలలోని పింఛన్ల కోసం వృద్ధులు, మహిళలు మారుమూల ప్రాంతాల నుంచి భారీ ఎత్తున పింఛన్లు తీసుకోవడంతో కోసం హుకుంపేట బ్యాంకు ఆఫ్ బరోడా బ్యాంకు వద్ద పడిగాపులు కాశారు. డబ్బులు తీసుకోవాలని ఆశతో ఉదయం నుండి బ్యాంకు వద్ద గంటల తరబడి వేచి ఉన్నారు.బ్యాంకు మేనేజర్ టెంటు, తాగునీరు ఏర్పాటు చేశారు.

డుంబ్రిగుడలో వద్ద పింఛనుదారులు

అభిలాష్, రాజ్‌కుమార్ మృతదేహాలు

వాగులో మునిగి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-రంపచోడవరం

విహారయాత్రకు వచ్చిన ఇద్దరు యువకులు మండలంలోని ఐ పోలవరం గ్రామ సమీపంలోని వాగులో మునిగి మృతి చెందిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... కాకినాడ జిల్లా పెద్దాపురం గ్రామానికి చెందిన యువకులు రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతాల్లోని పర్యాటక ప్రదేశాలను చూసేందుకు వచ్చారు. మండలంలోని ఐ.పోలవరం గ్రామం వద్ద వాగులోకి దిగి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు మునిగిపోయి అభిలాష్ (29), రాజకుమార్ (26) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రంపచోడవరం పోలీసులు తెలిపారు.

సిపిఎం చొరవతో మంచి నీటి సరఫరా

ప్రజాశక్తి-ఎటపాక

సిపిఎం నాయకులు డేగల మాధవరావు చొరవతో ఎటపాక గ్రామంలోని ఎస్సీ కాలనీలో ట్యాంకరు ద్వారా మంచినీటిని పంచాయతీ అధికారులు సరఫరా చేశారు. ఈ కాలనీలో వారం రోజుల నుండి మంచినీరు రాక అల్లాడుతున్న ప్రజల మంచినీటి కష్టాలను గుర్తించిన సీపీఎం యటపాక మండల నాయకులు డేగల మాధవరావు గ్రామ సచివాలయ కార్యదర్శి పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన కార్యదర్శి వాటర్ ట్యాంకుల ద్వారా మంచినీటిని సరఫరా చేసి ఎస్సీ కాలనీలో మంచినీటి సమస్యను పరిష్కరించారు. మంచినీరు సరఫరా చేసే మోటారుకు వచ్చే త్రీఫేస్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు కావడంతో వారం రోజులుగా మంచినీరు రాక ప్రజలు అనేక అవస్థలు పడ్డారని, చేతిపంపుల ద్వారా మంచినీరు తీసుకొచ్చే ప్రయత్నం ప్రజలు చేసినా బోర్లు కూడా సరిగా పనిచేయక నీటి కష్టాలు పడ్డారని సిపిఎం నాయకులు మాధవరావు తెలిపారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించి మంచినీటి సరఫరా చేసిన గ్రామ సచివాలయ కార్యదర్శి పద్మావతికి, సర్పంచ్ కారం వెంకటేశ్వర్లుకు, పంచాయతీ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. త్రీ ఫేస్ కరెంటు సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణం పరిష్కారం చేయాలని, అంతవరకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని డేగల మాధవరావు అధికారులకు విజ్ఞప్తి చేశారు.

ట్యాంకరు ద్వారా మంచినీటి సరఫరా చేస్తున్న పంచాయతీ సిబ్బంది

అభివాదం చేస్తున్న వెంకటరమణ, అప్పలనర్స, తదితరులు

బిజెపి, వైసిపిలను ఇంటికి సాగనంపాలి

సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ

ప్రజాశక్తి - చింతపల్లి : కేంద్ర, రాష్ట్రాలలో బిజెపి, వైసిపి ప్రభుత్వాలను ఇంటికి సాగనంపాలని, ఇండియా ఫోరం బలపరచిన అరకు పార్లమెంట్, పాడేరు శాసనసభ అభ్యర్థులను గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ కోరారు. స్థానిక గిరిజన ఉద్యోగ భవన్ లో సిపిఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు అధ్యక్షతన గురువారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పి అప్పల నరస, పాడేరు నియోజకవర్గ శాసనసభ కాంగ్రెస్ అభ్యర్థి శతక బుల్లిబాబు, సిపిఐ పార్టీ అల్లూరు జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణలతో కలిసి ఆయన మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్రాలలో బిజెపి, వైసిపి ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై దృష్టి సారించకుండా కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తున్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన గిరిజన చట్టాలు, హక్కులను నిర్వీర్యం చేస్తూ మన్య ప్రాంతంలో సహజ సిద్ధంగా నిక్షిప్తమై ఉన్న వనరులను దోచుకుపోయేందుకు రహదారులు" నిర్మిస్తున్నారు తప్ప ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్మించలేదన్నారు. మన్య ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదని విమర్శించారు.ఇండియా ఫోరం బలపరిచిన అభ్యర్థుల విజయానికి సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎర్ర బమ్మల ఎంపీటీసీ సభ్యుడు సేగ్గే సత్తిబాబు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటరమణ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు సాగిన కృష్ణ పడాల్, సిపిఎం నేత ధనుంజయ్, చిరంజీవి పాల్గొన్నారు.

ఇవిఎంల వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి -అరకు లోయ:రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఈవీఎంల వినియోగంపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం రూట్ అధికారులకు శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో అరకులోయ అసెంబ్లీ నియోజకవర్గం నియోజకవర్గ ఆర్.వో, ఐటిడిఏ పిఓ వి.అభిషేక్ అవగాహన కల్పించారు. ఈవీఎంలపై క్షుణ్ణంగా తెలుసు కోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో తహసిల్దార్‌లు సుధాకర్, సోమేశ్వరరావు, రూట్ ఆఫీసర్లు,ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పిఒ

సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే గిరిజనులకు న్యాయం

ఆ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు లోతా రామారావు, అప్పలనర్స

మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు

ప్రజాశక్తి-కూనవరం

రానున్న ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థుల గెలుపుతోనే గిరిజనులకు న్యాయం జరుగుతుందని ఇండియా వేదిక బలపరచిన సిపిఎం రంపచోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి లోతా రామారావు అన్నారు. మండలంలోని గుండువారిగూడెంలో సిపిఎం ఎన్నికల ప్రచారాన్ని సీపీఎం తెలంగాణ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచారంలో పాల్గొన్న అభ్యర్థి లోతా రామారావుకు ప్రజలు హారతి ఇచ్చి పూలమాలతో స్వాగతం పలికారు. డప్పు వాయిద్యాలు, ప్రజానాట్య మండలి కళాకారుల నృత్యాలతో ప్రచారం కోలాహలంగా సాగింది. ఈ సందర్భంగా లోతా రామారావు మాట్లాడుతూ సీపీఎం ఎమ్మెల్యేలు, ఎంపీలు ఉన్నపుడు మాత్రమే ఆదివాసీ చట్టాలు అమలయ్యాయని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, తరువాత ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. ఈ రోజు పోలవరం ప్యాకేజీ, పునరావాసం గురించి మాట్లాడే నాయకులు, ముంపు వాసులను పట్టించుకొనే నాధుడు లేరని, ఇక్కడి నుండి గెలిచిన ఎమ్మెల్యే, ఎంపీలు అసలు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోరాడే వారికి అధికారం ఇస్తే అసెంబ్లీలో గిరిజనుల సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి కృషి చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, కాంగ్రెస్ నాయకులు శ్రీమంతుల వెంకటరమణ, సీపీఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : మండలంలోని తెల్లంవారిగూడెం, పెద్ద మట్టపల్లి పంచాయతీ నూతిగూడెం, రేగడ గుంపు, జీడిగుప్ప పంచాయతీలోని జీడిగుప్ప, దారపల్లి, ముత్యాలమ్మ గండి తదితర ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తులపై ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింట ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం లక్ష్మి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కారం సుందరయ్య, పడ్లాది రమేష్, కమ్మ చిచ్చు సత్తి బాబు, ములకనపల్లి సర్పంచ్ సవలం మారయ్య, కొండారెడ్డి, మొసలి సత్యనారాయణ, శాఖ కార్యదర్శి తెల్లం కన్నారావు, తెల్లం శాంతిరాజు, తెల్లం శేఖర్, సోయం భద్రయ్య, కారం రమేష్, వెట్టి చందు పాల్గొన్నారు. మండలంలో వడ్డీగూడెంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు పంకు సత్తిబాబు, గుండెపూడి లక్ష్మణరావు కమ్మచిచ్చు సత్యనారాయణ, మొసలి సత్యనారాయణ, సోడే మల్లయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : సిపిఎం తోనే ఏజెన్సీ అభివద్ధి సాధ్యమని సిపిఎం మండల నాయకులు పొత్తూరు సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని అమీనాబాద్ పంచాయతీ పరిధి ఏబి కాలనీలో సీపీఎం నాయకులు ఇంటింట ప్రచారం నిర్వహించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స ప్రచారం

సీలేరు : జీకే వీధి మండలం రింతాడ పంచాయతీ పరిధి పెదపాడు, దుచ్చెరపాలెం గ్రామాల్లో సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్స పాచిపెంట గురువారం విస్తృత ప్రచారం చేశారు. గిరిజన చట్టాల అమలు కావాలన్నా, గిరిజన సమస్యలు పరిష్కారం కావాలన్నా సిపిఎం అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఎంపీగా తనను గెలిపిస్తే చట్టసభల్లో గిరిజనుల సమస్యలు పరిష్కారం చేసేలా కృషి చేస్తారని తెలిపారు. ఓటును సుత్తి కొడవలి, నక్షత్రం గుర్తుపై వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

జీకే వీధి మండల కేంద్రం సంతలో సిపిఎం నాయకులు గురువారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు గడుతూరి సత్యనారాయణ, కోర్ర బాలయ్య, చంటిబాబు, గెమ్మెల పరమేశ్వరరావు, బాబురావు, ఎ.దారకొండ సర్పంచ్ రామారావు, బూడిద రామారావు పాల్గొన్నారు.

కొయ్యూరు : మండలంలోని సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్స గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో యువతతో మాట్లాడారు. సిపిఎం అభ్యర్థిని గెలిపించుకుంటే మన హక్కులు కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వై.అప్పలనాయుడు, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

సిపిఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని ప్రచారం

అరకులోయ రూరల్ : ఇండియా కూటమి బలపరిచిన అరకు సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్సను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా నాయకులు పి.బాలదేవ్, కె మగ్గన్న, జగన్నాథం, హరిలు గురువారం సరభగూడలో ప్రచారం చేపట్టారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న ప్రదేశానికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, .ఇండియా ఫోరం దేశంలో అధికారంలోకి వస్తే ఉపాధి హామీ కూలీ రోజుకు రూ.400 కూలి పెంచుతామన్నారు.

హుకుంపేట : మండలంలోని మత్స్యపురం, బి.బొడ్డ పుట్టు పంచాయతీలో సీపీఎం నేతలు ప్రచారం చేపట్టారు. మందుగా ములకాయి పుట్టు జంక్షన్ నుండి డుంబ్రిగూడ, రాళ్ళ మత్స్యపురం, శెంబీ, కొత్తవలస, బంగారు మెట్ట, పెద్ద బూరుగుల, బొడ్డ పుట్టు పంచాయితీ, ఎర్ర గొప్పు గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యాలు కల్పించాలని పలువురు గిరిజనులు కోరారు. వైస్ ఎంపీపీ సూడిపల్లి కొండలరావు మాట్లాడుతూ, సీపీఎం ఎంపీ అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి, మెరకచింత మాజీ సర్పంచ్ వలసనైని లక్ష్మణ్ రావు, మండల నాయకులు పాంగి సోమన్న పాల్గొన్నారు.

డుంబ్రిగుడ : సిపిఎం ఎంపీ అభ్యర్థి పి అప్పలనర్సకు ఓటేసి గెలిపించాలని కోరుతూ మండలంలోని మారుమూల సోవ్వా పంచాయతీ మాలివలసలో ప్రచారం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం ఉండాలన్నా, అటవీ హక్కు చట్టం పటిష్టంగా అమలు పరచాలన్నా అది వామపక్షాలు, ఇండియా కూటమి అధికారంతోనే సాధ్యమవుతుందని ఆ పార్టీ మాజీ సర్పంచ్ సురేష్ కుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల నాయకులు పి.సత్యనారాయణ, టి సూర్యనారాయణ, పి.మత్తు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు : అరకు సిపిఎం ఎంపీ అభ్యర్థి పి అప్పలనర్సను గెలిపించాలని కించయిపుట్, జర్రెల, కొసమలపుట్టు, జర్జుల, గుమ్మ, దేగల పుట్టు, మండిబా, బొడ్డగుంట, గేదెల బందం, తాంగుల, బర్రిగూడ, మొత్త పుట్టులో ప్రచారం చేశామని సిపిఎం మండల కమిటీ సభ్యుడు ఎం.ఎం.శ్రీను, వైస్ ఎంపీపీ.పాటుబోయి సత్యనారాయణ, మఠం నరసింగరావు పడాల్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎంపీ అభ్యర్థి అప్పల నర్స, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గంగాధర స్వామికులు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గణపతి, నారాయణ, జీనబంధు, కిలో కష్టారావు, కిలో ఆనంద్ పాల్గొన్నారు.

అనంతగిరి : అరకు సిపిఎం పార్లమెంట్ అభ్యర్థి అప్పలనర్సకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరుతూ సిపిఎం నేతలు ఎన్ నాగులు, కిల్లో మొస్యలు మండలంలోని బొర్రా, కోనాపురం పంచాయతీ బొందుగు, అత్తిమల, కరాయిగుడ, కోనాపురం, బొడ్డగుడ. తదితర గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో భీమరాజు, చిన్నారావు పాల్గొన్నారు.



ముంచంగిపుట్టు మండలంలో గిరిజనులతో కలిసి నినాదాలు చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

ప్రజాశక్తి-సీలేరు : సంఘ విద్రోహశక్తులకు తావివ్వకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అందరూ సహకరించాలని స్థానిక ఎస్సై రామకృష్ణ గిరిజనులకు విజ్ఞప్తి చేశారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ రేవటమడుగు గ్రామంలో గురువారం గిరిజనులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని ప్రజాస్వామ్యంలో భాగస్తులు కావాలని, ఈ ప్రాంత అభివృద్ధి చేసుకొనేందుకు మంచి నాయకుడిని ఎన్నుకోవాలని కోరారు. ఎన్నికల్లో ఎవరైనా నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ముమ్మరంగా పోలీసు తనిఖీలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రుద్రరాజు భీమరాజు ఆధ్వర్యంలో ఎస్ఐ రామునాయుడు మండలంలోని ఆకుమామిడి కోట, పుల్లంగి, గుండ్రతి పరిసర ప్రాంతాలలో గురువారం నాడు విస్తృత తనిఖీలు నిర్వహించారు. డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్ బృందాలతో ముఖ్యమైన ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని గుర్తేడు, మారేడుమిల్లి పరిసర ప్రాంతాలలో పూర్తి స్థాయి భద్రత ఏర్పాట్లు చేశామని సీఐ భీమరాజు తెలిపారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని వంజరి పంచాయతీ తాటిపాలెం గ్రామంలో గురువారం సిఐ రమేష్, ఎస్ఐ శ్రీనివాస్‌లు పర్యటించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించు కోవాలన్నారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లకు తావు లేకుండా ఉండాలన్నారు. నాటు సారా అమ్మితే తమకు సమాచారం అందించాలని కోరారు.అల్లర్లకు పాల్పడితే చట్టపరమైన చర్యలు కఠినంగా ఉంటాయని తెలిపారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ప్రత్యేక పోలీస్ గ్రహాండ్ దళాలు, గ్రీవెన్స్ దళాలు పాల్గొన్నారు.

బమ్మిడి సూర్యనారాయణకు సత్కారం

ప్రజాశక్తి- ఆనందపురం : భీమిలి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఉపాధ్యక్షునిగా ఎన్నికైన బమ్మిడి సూర్యనారాయణను బార్ అసోసియేషన్ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. పలు సేవా కార్యక్రమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న ఆయనకు ఆరోసారి అసోసియేషన్‌కు ఎన్నికకావడంపై అందరూ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమిలి బార్ అసోసియేషన్ మాజీ ప్రధాన కార్యదర్శి నమ్మి సూరిబాబు, గణేష్, లొడగల సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాడుగులలో కాంగ్రెస్ ప్రచారం

ప్రజాశక్తి - మాడుగుల: మాడుగులలో కాంగ్రెస్ పార్టీ నేతలు గురువారం ప్రచారం చేపట్టారు. మాడుగుల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి వేగి వెంకటేష్ సతీమణి వేగి ప్రత్యూషలు మాడుగుల, కెజే పురం గ్రామాల్లో ప్రచారం చేశారు. ఇంటింటికి వెళ్లి తమ అమూల్యమైన ఓటును హస్తం గుర్తుకు వేయాలని కోరారు. ప్రజలతో మమేకమైవారి సమస్యను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు పడాల కొండలరావు, మండల కాంగ్రెసు అధ్యక్షులు బాలిబోయిన అప్పారావు, ఎస్సీ సెల్ మండల చైర్మన్ బడిబండి రాజు, పరిదేశి, నియోజకవర్గ యూత్ ప్రెసిడెంటు యేసు రాజు, సిపిఎం నాయకులు రొంగలి దేముడు నాయుడు, యువజన నాయకుడు కచ్చా సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఉప ఖజానా కార్యాలయం కూల్చివేత

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో శిథిలావస్థకు చేరుకున్న ఉపఖజానా కార్యాలయాన్ని కూల్చి వేశారు. సుమారు 50 సంవత్సరాల పాటు ఈ కార్యాలయం కోటవురట్ల, నాతవరం, మాకవరపాలెం మండలాలకు విశిష్ట సేవలు అందించింది. ప్రస్తుతం కార్యాలయం మండల పరిషత్ ఆవరణలో అద్దె భవనంలో కొనసాగుతుంది. కాగా కొత్త ఖజానా కార్యాలయానికి 60 లక్షలు మంజూరైనట్లు తెలిసింది. త్వరలో కార్యాలయం నిర్మాణ పనులు ప్రారంభిస్తామని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుండి హోమ్ ఓటింగ్

ప్రజాశక్తి-నక్కపల్లి: పాయకరావుపేట నియోజకవర్గంలో అసెంబ్లీ ,పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి హోమ్ ఓటింగ్ ప్రక్రియ నిర్వహించేందుకుగాను అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆర్వో గీతాంజలి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈనెల 3, 4, 5 తేదీలతో పాటు 7 ,8 తేదీల్లోనూ హోమ్ ఓటింగ్ నిర్వహించనున్నామని తెలిపారు. సీనియర్ సిటిజన్స్ (85 సంవత్సరాలు దాటిన వారు), దివ్యాంగులు ఇంటి వద్ద ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తామన్నారు. పాయకరావుపేట నియోజక వర్గంలో 217 మంది హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేశారన్నారు. ఇప్పటికే దరఖాస్తులు తీసుకుని పరిశీలించి,ఆమోదించి జాబితా రూపొందించామన్నారు. సెక్టోరియల్ అధికారుల ఆధ్వర్యంలో భద్రత సిబ్బంది పర్యవేక్షణలో, హోమ్ ఓటింగ్ చేపడతామన్నారు. వీరికి పోస్టల్ బ్యాలెట్లు అందజేస్తామన్నారు.రాజకీయ పార్టీల పోలింగ్ ఏజెంట్లు హాజరవుతారని, వీడియో చిత్రీకరణ ఉంటుందని వెల్లడించారు.

కూటమి నేతల ప్రచారం

ప్రజాశక్తి -చీడికాడ: మండలంలో గురువారం కోణం పంచాయతీతో పాటు వీరభద్ర పేట, కండివరం గ్రామాలలో తెలుగుదేశం జనసేన బిజెపి కూటమి అభ్యర్థి బండారు సత్యనారాయణ ఎన్నికల ప్రచారం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాడుగుల నియోజకవర్గం అభివృద్ధికి పాటు పడతామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, పార్టీ అధ్యక్షులు చిన్నమనాయుడు, మాజీ సర్పంచ్ అప్పారావు, కోణం జలాశయం చైర్మన్ ముసలి నాయుడు, జనసేన నేతలు గుమ్మడి శ్రీరామ్ బిజెపి కన్వీనర్ శ్రీను అధ్యక్షులు మురళి పాల్గొన్నారు

ఆర్‌టిసి డ్రైవర్‌పై మందుబాబుల దాడి

ప్రజాశక్తి- వడ్డాది : అనకాపల్లి డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు మాడుగుల నుండి అనకాపల్లి వస్తున్న సమయంలో బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట వంతెన వద్ద మందు బాబులు ఆపి వీరంగం సృష్టించారు. ముగ్గురు వ్యక్తులు బస్సుకు బైక్‌ను అడ్డంగా పెట్టి డ్రైవర్ కిందకి దింపి ఆయనపై దాడి చేశారు. దీనిని ప్రశ్నించిన ప్రయాణికులపైనా ఎదురు తిరిగారు. వీడియోలు తీస్తున్న వారిపై దాడికి ప్రయత్నించారు. ద్విచక్ర వాహనంపై వస్తున్న వారికి బస్సు డ్రైవర్ దారి ఇవ్వలేదన్న కారణంతో బస్సు డ్రైవర్‌పై దాడి చేశారు.

వెనక వస్తున్న లారీ డ్రైవర్ ఇదేంటని ప్రశ్నించగా లారీ డ్రైవర్‌ని చితకబాది తీవ్రంగా గాయపరిచారు. లారీ అద్దం రాయితో పగలగొట్టారు. వారి ప్రవర్తనను చూసి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆర్టీసీ డ్రైవర్ కండక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు కేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు రాజ్యాంగ పరిరక్షణ వేదిక సదస్సు

ప్రజాశక్తి-అనకాపల్లి : రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక న్యూకాలనీ రోటరీ క్లబ్‌లో 'రాజ్యాంగాన్ని పరిరక్షించండి- ఇండియా కూటమిని గెలిపించండి' అనే అంశంపై సదస్సు జరుగుతుందని వేదిక నాయకులు గంట శ్రీరామ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు, కో కన్వీనర్ కె.విజయరావు, విభజన హామీల సాధన సమితి రాష్ట్ర కార్యదర్శి చలసాని శ్రీనివాస్, మాజీ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, వివిధ నియోజకవర్గాలకు చెందిన ఇండియా కూటమి అభ్యర్థులు పాల్గొంటారని తెలిపారు.

చిత్ర లేఖనంపై శిక్షణ

ప్రజాశక్తి-చోడవరం : వేసవి శిక్షణలో భాగంగా చోడవరం చిత్రకళా నిలయం ఆధ్వర్యంలో చిత్రలేఖనంపై శిక్షణ ఇవ్వనున్నట్లు నిలయం నిర్వాహకులు బి సూర్యనారాయణ తెలిపారు. మే నెలలో పూర్తిగా శిక్షణా ఉంటుందని, 1వ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుకునే విద్యార్థులు ఇందులో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చిత్రలేఖనం, పెయింటింగ్స్‌పై ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. చోడవరం పిల్లవారి తోట, జాన్ మాస్టర్ చర్చి వద్ద చిత్రకళా నిలయంలో ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు.

ఘనంగా పరదేశమ్మ పండగ

ప్రజాశక్తి -కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ గ్రామంలో గురువారం పరదేశమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే పండగ కావడంతో గ్రామ ప్రజలతోపాటు పరిసర ప్రాంత ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద పలు సాంస్కృతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సర్పంచి దాడి ఎరుకు నాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, పెద్దలు పాల్గొన్నారు.

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సాయికృష్ణ

ప్రజాశక్తి- మునగపాక : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా మునగపాక గ్రామానికి చెందిన కర్రి సాయికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం సాయికృష్ణ విలేకరులతో మాట్లాడుతూ బుధవారం రాత్రి తనకు ఉత్తర్వులను అందినట్లు చెప్పారు. గతంలో టిడిపి విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షునిగా, జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర ఉపాధ్యక్షునిగా, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా 15 ఏళ్ల నుండి పార్టీకి ఎనలేని సేవలు చేసిన తనకు ఈ అవకాశం కల్పించినట్లు చెప్పారు.

ఆర్‌ఎస్‌ఐ సూరిబాబుకు ఘనంగా వీడ్కోలు

ప్రజాశక్తి- అనకాపల్లి : పోలీస్ శాఖలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన ఆర్ఎస్ఐ కె.సూరిబాబుకు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్పీ కార్యాలయంలో గురువారం సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, ఏఓ బి.శారద, ఇన్స్పెక్టర్లు సతీష్, మన్మధరావు, ఆర్ఎస్ఐలు దిల్లేశ్వరరావు, ఆదినారాయణ, సూరిబాబు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

శరవేగంగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు : ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున దీనికి లోబడి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించి మే, జూన్ 2024 నెలల్లో సామాజిక భద్రతా పింఛనులు పంపిణీ చేస్తున్న విషయము విదితమే. ఇందులో భాగంగా రెండవ రోజైన గురువారం నాటికి పింఛన్ల పంపిణీలో జిల్లా అగ్రస్థానంలో నిలిచిందని జిల్లా కలక్టర్ ఎం.విజయ సునీత తెలిపారు. గురువారం సాయంత్రం 6.30 గంటల సమయానికి డోర్ టు డోర్ పింఛన్ల పంపిణీలో 93.87 శాతం పంపిణీతో నాల్గవ స్థానం సాధించిందని, అదే సమయానికి డిబిటి విధానంలోని పంపిణీలో 98.85 శాతంతో రెండవ స్థానం సాధించిందన్నారు. మొత్తం మీద డిబిటి, డోర్ టు డోర్ కలిపి ఓవరాల్ గా 98.12 శాతంతో మొదటి స్థానంలో నిలిచిందని కలక్టర్ వివరించారు. జిల్లాలో 1,27,435 మంది సామాజిక భద్రతా పథకం కింద పించనులు పొందుతున్నారని, ఏ ఒక్కరు కూడా పించనుల కోసం సచివాలయలకు వెళ్ళనవసరం లేకుండానే పించనులు పొందుతున్నారని జిల్లా కలక్టర్ తెలిపారు. ఇందులో 1,08,626 మంది పించనుదారులకు వారి వారి ఖాతాలకు జమచేయడం జరుగుతుందని, మిగిలిన దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితర 18,809 మందికి ఇంటి వద్దకే వెళ్ళి పించనులు పంపిణీ చేస్తున్నారని కలక్టర్ వివరించారు. జిల్లాలో డోర్ టు డోర్ పంపిణీలో 98.01 శాతం మంది లబ్దిదారులకు వారి ఇంటి వద్దనే పించనులు పంపిణీ చేశామన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం నాటికి శతశాతం పించనులు పంపిణీ పూర్తి చేయాలని అధికారులను కలక్టర్ ఆదేశించారు.

స్థానికేతరులు ఓడిపోవడం ఖాయం

సిఎం రమేష్‌లా నేను దోపిడీలు చేయలేదు
వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:అనకాపల్లి లోక్‌సభ పరిధిలోని ప్రజలు స్థానికేతరులను ఓడించడం ఖాయమని ఉపముఖ్యమంత్రి, అనకాపల్లి వైసీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు అన్నారు. గురువారం నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తో కలిసి మీడియాతో మాట్లాడారు. గతంలో ఇక్కడ పోటీ చేసిన స్థానికేతరులైన నూకారపు సూర్యప్రకాశరావు, అల్లు అరవింద్‌లను ఓడించిన చరిత్ర ఉందన్నారు. బిజెపి అభ్యర్థి సీఎం రమేష్ ను కూడా ఓడిస్తారని చెప్పారు. సీఎం రమేష్‌లా తాను బ్యాంకులను మోసం చేయలేదని, దోపిడిలు చేయలేదన్నారు. టీడీపీ శాసనసభ అభ్యర్థులు డబ్బుల కోసం రాయలసీమ నుంచి వచ్చిన సీఎం రమేష్‌కు సాగిలపడ్డారని ఆరోపించారు. అయ్యన్నపాత్రుడు వంటి సీనియర్ నాయకుడు సైతం స్థానికులకే టికెట్ అంటూ పెద్ద పెద్ద డైలాగులు మాట్లాడి, డబ్బు కోసం రమేష్‌కు లొంగిపోయారని ఎద్దేవా చేశారు. రెండు దఫాలు రాజ్యసభ సభ్యుడుగా ఉన్న సీఎం రమేష్, ఏనాడు విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి మాట్లాడలేదని, ఉత్తరాంధ్ర పై అసలు అవగాహన లేదన్నారు. రాష్ట్రానికి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని సీఎం జగన్ మేనిఫెస్టో రూపొందించారన్నారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వైసీపీ అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ చింతకాయల సన్యాసిపాత్రుడు, గ్రంధాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్, వైసిపి అధ్యక్షులు ఏకా శివ పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం : మాజీ మంత్రి అయ్యన్న

ప్రజాశక్తి- అనకాపల్లిడెస్క్: ఎన్డీఏ అధికారంలోకి వచ్చిన వెంటనే న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని మాజీ మంత్రి, నర్సీపట్నం ఎన్డీఏ అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. గురువారం నర్సీపట్నం బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న కోర్టు సముదాయంలో రెండవ, మూడవ ఫ్లోర్ ఏర్పాటుకు కృషిచేస్తానన్నారు. బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్: నర్సీపట్నం మండలం పెదబొడ్డేపల్లి 33/11 కేవీ, రోలుగుంట సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలో ఈ నెల 3న శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పెదబొడ్డేపల్లి విద్యుత్ శాఖ డివిజనల్ ఇంజనీర్ డీవీడీ.రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ లైన్, సబ్ స్టేషన్ లలో మరమ్మత్తుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.వినియోగదారులు సహకరించాలని కోరారు.

అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని లింగంపేట పంచాయతీ తాళ్లచీడికాడ శివారులో జీడిమామిడి తోటలో వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. రామచంద్రపురం గ్రామానికి చెందిన అమ్మిరెడ్డి సూర్యం(60) ఎప్పటిలాగే జీడితోటలో పిక్కలు ఏరేందుకు వెళ్లింది. సాయంత్రం అయినప్పటికీ వృద్ధురాలు ఇంటికి రాక పోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు తోటలోకి వెళ్లి చూశారు. ఆమె మృతి చెంది ఉండటంలో కుటుంబ సభ్యులు కేడిపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేడిపేట ఎస్సై ఉపేంద్ర దర్యాప్తు ముమ్మరం చేశారు.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి జోగులు ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని అమలాపురం, మూలపర్ర, పాటిమీద, బంగారమ్మ పేట గ్రామాల్లో గురువారం పాయకరావుపేట నియోజకవర్గం వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు ప్రచారం చేపట్టారు.పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటా ప్రచారం చేపట్టి, సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహమూర్తి, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, నాయకులు సూరకాసుల గోవింద్, కొప్పిశెట్టి హరి బాబు, ఎలమంచిలి తాతబాబు పాల్గొన్నారు.

తాళ్లవలసలో వైసిపి, టిడిపి పరస్పర దాడులు

ముగ్గురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని తాళ్లవలస పంచాయతీ, గొల్లలతాళ్లవలసలో బుధవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో వైసిపి, టిడిపి గ్రూపుల మధ్య పరస్పరం దాడులు జరిగాయి. ఈ దాడుల్లో గాయాల తీవ్రతను చూస్తే మారణాయుధాలు ఉపయోగించారని తెలుస్తోంది. రాళ్లు, కర్రలు, కొన్ని మారణాయుధాలతో పరస్పరం జరిగిన దాడుల్లో గొల్లల తాళ్లవలసకు చెందిన కొంగరాని సూర్యనారాయణ (సూరిబాబు) మెడ వెనుక భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. ఇతని మెడ వెనుక భాగంలో ప్రత్యర్థులు కత్తితో దాడిచేసినట్టుగా గాయాన్ని బట్టి తెలుస్తోంది. అక్కరమాని ఎర్రయ్య (60)కు చెవి వెనుక భాగంలో, అక్కరమాని అప్పలరాజు (32) కాలికి తీవ్ర గాయాలయ్యాయి. కొట్లాట జరిగిందన్న సమాచారంతో నార్త్ సబ్ డివిజన్ ఎసిపి సునీల్, భీమిలి సిఐ డి రమేష్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిస్థితి చేయి దాటిపోకుండా వైసిపి, టిడిపిలకు చెందిన కొందరిని అదుపులోకి తీసుకున్నారు. భీమిలి సిఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్ర గాయాలైన ముగ్గురిని భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని పోలీసులు హెచ్చరించారు.

కొట్లాటకు ఇదే కారణమా?

ఓ సామాజిక తరగతికి చెందిన వాట్సాప్ గ్రూపులో వైసిపి, టిడిపికి చెందిన కొందరు రెచ్చగొట్టేలా పరస్పరం వ్యాఖ్యలు చేస్తూ మెసేజ్‌లు పెట్టుకున్నారని కొందరు అంటున్నారు. దీంతో ఇరు పార్టీల అనుయాయులు మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో వాట్సాప్ మెసేజ్‌లు సాగాయి. ఫలితంగా చివరకు తీవ్ర కొట్లాటకు దారి తీసినట్లుగా కొందరు గ్రామస్తులు తెలిపారు.

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి - ఆరిలోవ : తూర్పు నియోజకవర్గం పరిధి ఆరిలోవ ప్రాంతంలో ఉపకార్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్, సినీ నిర్మాత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు గురువారం టిడిపిలో చేరారు. జివిఎంసి 12వ వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, నెహ్రూనగర్‌లో గురువారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సమక్షంలో కంచర్ల అచ్యుతరావు తన అనుచర గణంతో టిడిపిలో చేరారు. ఆయనతో పాటు మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, వైసిపి నాయకుడు పారిపల్లి రామారావు కూడా తన అనుచరులతో టిడిపిలో చేరారు.

3, 4 వార్డుల్లో గంటా ప్రచారం

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు గురువారం జివిఎంసి 3, 4 వార్డుల పరిధిలోని ఎగువపేట, గంటస్తంభం, గుప్తా వీధి, అప్పికొండ వీధి, కృష్ణా కాలనీ, గొల్లలపాలెం, చేపల తిమ్మాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచార సభల్లో ఆయన మాట్లాడుతూ, భీమిలిలో ఫిషింగ్ జెట్టి, బీచ్ వద్ద కోతకు గురికాకుండా ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు కార్పొరేటర్ గంటా అప్పల కొండ, నాయకులు చురకల రమణ, పి.లక్ష్మీకుమారి, గంటా నూకరాజు, కనకల అప్పల నాయుడు, ఎం సంజీవ్ కుమార్, గండిబోయిన పోలి రాజు తదితరులు పాల్గొన్నారు

గోపాలమిత్రుల వినతి

23 ఏళ్లుగా పనిచేస్తున్న తమకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ స్థానిక టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు రాష్ట్ర గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు

ముస్లింలు చేరిక

పలువురు ముస్లిములు గంటా శ్రీనివాసరావు సమక్షంలో టిడిపిలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

13 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలోని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 13 మందికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించారు. కెజిహెచ్ నుంచి వచ్చిన శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బి.ఆనంద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 13 మంది మహిళలకు శస్త్ర చికిత్సలు చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ ఎం.గంగునాయుడు, డాక్టర్ షేక్ షహనాజ్ సాధియా, సామాజిక ఆరోగ్య అధికారి పి.సాంబమూర్తి, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో గెలుపెవరిదో..?

అనకాపల్లి జిల్లాలో నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో రాజకీయం రసవత్తరంగా సాగుతోంది. తాజా ఎన్నికల్లో ఇక్కడి సమస్యలే గెలుపును ప్రభావితం చేస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఎవరివైపు మొగ్గు చూపుతారనేది ఆసక్తికరంగా మారింది. అధికార వైసిపి, విపక్ష టిడిపి కూటమి, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య పోటీ ఉండగా విజయం ఎవరిని వరిస్తుందనేది చెప్పడం అంత సులువు కాదనే అభిప్రాయం వ్యక్తమౌతోంది. అన్ని పార్టీలు ప్రతిష్టాత్మకంగా భావించే నర్సీపట్నంలో ప్రస్తుతం వాడీవేడిగా పరస్పర ఆరోపణలు, పోటాపోటీ చేరికలతో, విస్తృత ప్రచారాలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

- ▶▶ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు వైసిపి కసరత్తు
- ▶▶ పూర్వ వైభవానికి టిడిపి ఆరాటం
- ▶▶ పుంజుకున్న కాంగ్రెస్
- ▶▶ ఎన్నికల అజెండాలో స్థానిక సమస్యలు

నర్సీపట్నంలో అసంపూర్తిగా ఉన్న మెయిన్‌రోడ్డు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్

ఉమ్మడి విశాఖ ఏజెన్సీకి ముఖద్వారమైన నర్సీపట్నం 1955లో ద్విసభ నియోజకవర్గంగా ఆవిర్భవించింది. ఈ నియోజకవర్గంలో నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ, మాకవరపాలెం మండలాలున్నాయి. నియోజకవర్గంలో కాంగ్రెస్, టిడిపిలు తొలిరోజుల్లో పట్టునిరూపించుకోగా, వైసిపి ఆవిర్భావం తర్వాత ఒక ఓటమి, మరో గెలుపుతో నేను సైతం అన్నట్లు ఉంది. తొలిరోజుల్లో తంగేడు రాజులు, అయ్యన్నపాత్రుడు కుటుంబీకులు మధ్య నువ్వానేనా అన్నట్లు పోటీ ఉంది. 1955లో ద్విసభ నియోజకవర్గంగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఎం.పోతురాజు, ఆర్ఎస్ఎన్.రాజు విజయం సాధించారు. 1962లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్ఎస్ఎన్.రాజుపై ఆర్.లత్సాపాత్రుడు ఇండిపెండింట్‌గా గెలుపొందారు. 1967, 1972 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఆర్ఎస్ఎన్.పాత్రుడు ఇండిపెండెంట్ అభ్యర్థి ఆర్ఎల్.పాత్రుడు, భోళెం గోపాత్రుడు(జనతా)లపై గెలుపొందారు. 1978లో భోళెం గోపాత్రుడు కాంగ్రెస్ నుంచి పోటీకి దిగి విజయం సాధించాడు. 1983లో తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ హవా కొనసాగింది. 1983, 1985 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడు కాంగ్రెస్ అభ్యర్థులు ఆర్ఎస్ఎన్.రాజు, వేచలపు శ్రీరామ్మూర్తిలపై విజయం సాధించారు. 1989 ఎన్నికల్లో మాజీ మంత్రి తంగేడుకు చెందిన సూర్యనారాయణరాజు కుమారుడు కృష్ణమూర్తిరాజు చేతిలో ఓడిపోయిన అయ్యన్నపాత్రుడు 1994లో జరిగిన ఎన్నికల్లో తిరిగి అదే కృష్ణమూర్తిరాజుపై విజయం సాధించారు. 1996లో నర్సీపట్నం అసెంబ్లీలో జరిగిన ఉప ఎన్నికల్లో వేచలపు శ్రీరామ్మూర్తి తెలుగుదేశం పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పట్లో అయ్యన్నపాత్రుడు ఎంపీగా పోటీ చేయాల్సి వచ్చింది.

1999, 2004 ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి అయ్యన్నపాత్రుడు కాంగ్రెస్ అభ్యర్థి రామచంద్రరావు, ఇండిపెండెంట్ నారాయణరాజులపై వరుస విజయాలు సాధించారు. అయితే 2009లో కాంగ్రెస్ అభ్యర్థి బోళెం ముత్యాలపాప చేతిలో అయ్యన్న ఓటమిపాలయ్యారు. 2014 ఎన్నికల్లో అపుడే ఆవిర్భవించిన వైసిపి తరపున సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ సోదరుడు పెట్ల ఉమాశంకర్ గణేష్ పోటీచేయగా అతనిపై గెలుపొందిన అయ్యన్న, 2019లో అదే వైసిపి అభ్యర్థి గణేష్ చేతిలో ఓటమి చెందారు.

నర్సీపట్నం నియోజకవర్గంలో 1983 నుంచి ఇప్పటివరకు తొమ్మిదిసార్లు పోటీచేసిన అయ్యన్న ఆరు పర్యాయాలు గెలుపొంది, ఐదుసార్లు మంత్రిగా పనిచేసిన అనుభవం ఉంది. ఇపుడు పదోసారి బరిలో నిలిచారు తాజా ఎన్నికల్లో వైసిపి అభ్యర్థిగా గణేష్, టిడిపి అభ్యర్థిగా అయ్యన్నపాత్రుడుతోపాటు ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిగా రుత్తల శ్రీరామ్మూర్తి పోటీచేస్తున్నారు. తాజా ఎన్నికల్లో ప్రచారం నువ్వానేనా అన్నట్లు సాగుతుండగా, గెలుపు ఎవరిని వరిస్తుంది, నర్సీపట్నం పీఠం ఎవరికి దక్కుతుందనేది సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పోటీలో ఉన్న ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే



చింతకాయల అయ్యన్నపాత్రుడు (టిడిపి) | రుత్తల శ్రీరామ్మూర్తి (కాంగ్రెస్). | ఉమాశంకర్ గణేష్ (వైసిపి)

పోటాపోటీగా ప్రచారాలు

సిటింగ్ ఎమ్మెల్యే గణేష్ తరపున అతని సోదరుడు సినీ నటుడు సాయిరామ్‌శంకర్, గణేష్ సతీమణి కళావతి ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయ్యన్నపాత్రుడు కూడా ఈసారి ఎన్నికల్లో ఎలా అయినా గెలవాలని గట్టి ప్రయత్నం చేస్తున్నారు. ఆయన సతీమణి పద్మావతి, కుమారులు విజయ్, రాజేష్, కోడళ్లంతా తలో వైపు విస్తృతంగా ప్రచారాలు చేస్తున్నారు. ఇక ఇండియా ఫోరం బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి రుత్తల రామ్మూర్తి తరపున కాంగ్రెస్‌తోపాటు సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు ప్రచారం సాగిస్తున్నారు.

సమస్యలు తీరుస్తామని భరోసా ఇచ్చేవారికే ఛాన్స్!

నర్సీపట్నం నియోజకవర్గంలో అనేక సమస్యలు తిష్టవేసి ఉన్నాయి దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న వీటిపై భరోసా ఇచ్చేవారికి గెలుపు అవకాశాలు ఉంటాయని పలువురు భావిస్తున్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వీధిదీపాలు కరువయ్యాయి. పారిశుధ్యం కొరవడింది. అర్థాంతరంగా ఆగిపోయిన ప్రధాన రోడ్డు విస్తరణ, గృహప్రవేశాలకు నోచుకోని టిడ్కో ఇళ్ల, నర్సీపట్నం కేంద్రంగా ఐటిడిఎ ఏర్పాటు హామీ, తాండవ ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు వంటి సమస్యలపై పదేళ్లుగా కొనసాగిన నిర్లక్ష్యం ఈసారి ప్రజలను ఆలోచింపజేస్తోంది. టిడిపి, వైసిపి ప్రభుత్వాల హయాంలో నియోజకవర్గంలోని ప్రధాన సమస్యలు పరిష్కారం కాలేదని వారు వాపోతున్నారు.

జోరుగా వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి గణేష్ ప్రచారం

ప్రచారం చేస్తున్న వైసిపి అభ్యర్థి ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-అనకాపల్లిడెస్క్:నర్సీపట్నం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పెట్ల ఉమాశంకర్ గణేష్ గురువారం నర్సీపట్నం మున్సిపాలిటీ 25వ వార్డులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా నూకాలమ్మ తల్లి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని అనంతరం వార్డు నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎన్నో సంక్షేమం పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మళ్లీ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే జగన్ ను సీఎం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసి పాత్రుడు, మున్సిపల్ చైర్ పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మీ, వైస్ చైర్మన్లు కోనేటి రామకృష్ణ, తమరాన అప్పలనాయుడు, వార్డు ఇన్‌చార్జ్ దేవత అరుణ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మెయిన్ రోడ్డులో బుధవారం జరిగిన తాటికొండ అచ్చమనాయుడు హత్య కేసులో నిందితుడు గన్రెడ్డి శ్రీనివాసరావును అరెస్టు చేసినట్లు కొత్తకోట సిఐ ఎల్.అప్పలనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్‌లో ఆయన స్థానిక విలేకరులకు హత్య కేసు వివరాలను తెలియజేశారు. మృతుడు అచ్చం నాయుడుకు, నిందితుడు గన్రెడ్డి శ్రీనివాసరావు కుటుంబాలకు మధ్య గొడవలు ఉన్నాయి. మంగళవారం రాత్రి ఇద్దరి మధ్య వివాదం జరిగింది.

ఈ నేపథ్యంలో శ్రీనివాసరావు బుధవారం ఉదయం అచ్చంనాయుడుని కత్తితో నరకడం ఆయన మృతి చెందినట్లు తమ దర్యాప్తులో తేలిందని సిఐ తెలిపారు. నిందితుడు శ్రీనివాసరావును గురువారం రాజాం జంక్షన్లో అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో బుచ్చయ్యపేట ఎస్సై డి ఈశ్వరరావు పాల్గొన్నారు.